క్లుప్తంగా

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ



వలంటీర్ల మొబైళ్లను ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు అప్పగిస్తున్న సచివాలయ సిబ్బంది

అల్లవరం: గ్రామాల్లోని సచివాలయాల్లోనే ఈ నెల 3వ తేదీన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లచే పింఛన్ల పంపిణీని ఎన్నికల కమిషన్ అడ్డుకోవడంతో ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించామన్నారు. సచివాలయంలోని ఉద్యోగులందరూ వేలిముద్ర, ఐరిస్ ద్వారా పింఛన్లు అందజేస్తారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వలంటీర్ల నుంచి 261 మొబైల్స్, 197 బయోమెట్రిక్ పరికరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎన్నికల వ్యూహంపై నేడు సమావేశం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు కార్యకర్తలు, నాయకులతో యర్రాగార్డెన్స్‌లోని మినీగాజుల గార్డెన్ ఫంక్షన్ హాలులో సోమవారం సమావేశం కానున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వానికి యానాం అభివృద్ధి పనుల దృష్ట్యా తాను ఇండిపెండెంట్ సభ్యుడిగా మద్దతిస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలో తనను యానాం ఇన్‌చార్జిగా నియమించారన్నారు. ప్రభుత్వ పరంగా ఇప్పటికే సుమారు రూ.100 కోట్లకు పైగా మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చిన ఘనత బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమికే దక్కిందన్నారు. ఈ ఎన్నికల్లో మత్స్యకారులంతా ఆ కూటమికే మద్దతునిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

3న వైథిలింగం ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న సిటింగ్ ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి వి.వైథిలింగం ఈ నెల 3న యానాంలో ప్రచారాన్ని నిర్వహించనున్నారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 16 వరకూ ఆయన పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో ప్రచారం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో యానాంలో చేసే ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానిక నాయకులు మల్లాడి సత్తిబాబు తదితరులు సన్నాహాలు చేస్తున్నారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడి గ్రామంలో కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. సర్పంచ్ చెల్లుబోయిన నాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కముజు రమణ, దొంగ చిన్న తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

నవోదయకు 80 మంది ఎంపిక

యానాం: స్థానిక నవోదయ విద్యాలయలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ఆదివారం తెలిపారు. మొత్తం 460 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా 80 మంది ఎంపికయ్యారన్నారు. వీరందరికీ ఈ నెల 15 నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

ఇది ప్రతిపక్షాల కుట్రే..



దేవాదుల సూర్య నారాయణమూర్తి

అమలాపురం టౌన్: ఎన్నికల కోడ్ ముసుగులో ప్రతిపక్షాలు పేదలపై కక్ష కట్టి పెన్షన్లు అందకుండా అడ్డుకుంటున్నాయని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఇస్తున్న మొత్తం కోసం ఇళ్ల వద్దే ఎదురుచూస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు అమలాపురంలో సూర్యనారాయణమూర్తి ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ డబ్బులతో ఎంతో మంది అవ్వాతాతలు మందులు, ఇతర కనీస అవసరాలకు ఉపయోగించుకుంటారని తెలిపారు. పెన్షన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ పేరుతో ప్రతిపక్షాలు పన్నిన కుట్రగా లబ్ధిదారులు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థులు

కాట్రేనికోన: మండలంలోని చింతల మెరక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కడలి లోహిత సాయి ప్రియాంక, సంసాని రామ్ శ్రీనిత్‌లు నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపీపీ పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ కుమార్, నల్లా నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు భాగ్యరాజు తదితరులు అభినందించారు.

వడ్డీ మాఫీ.. పట్టణాభివృద్ధి సాఫీ



స్థానిక వైద్యుడి నుంచి పన్ను కట్టించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్వో శివాజీ

- అమలాపురంలో సద్వినియోగం చేసుకున్న 85 శాతం పన్నుదారులు
- స్వచ్ఛందంగా ముందుకొచ్చిన పట్టణవాసులు

అమలాపురం టౌన్: పట్టణాల్లో ఆస్తి పన్నులను మార్చి 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామన్న ప్రకటనకు అమలాపురం పట్టణంలో 85 శాతం పన్నుదారులు స్పందించారు. మిగిలిన 15 శాతం మంది రాయితీని సద్వినియోగం చేసుకోలేకపోయారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, మున్సిపల్ రెవెన్యూ అధికారి (ఆర్వో) శిరిగినీడి శివాజీ, ఆ విభాగం సిబ్బంది గత నెల రోజులుగా పన్నుల వసూళ్లకు కార్యాలయ పనివేళలకు మించి శ్రమించారు. మైక్‌ల ద్వారా, కర పత్రాలు, పత్రికా ప్రకటలన ద్వారా వడ్డీ రాయితీ సద్వినియోగానికి విస్తృత ప్రచారం చేశారు. అది సత్ఫలితాలనిచ్చింది. సకాలంలో పన్నుల వసూళ్ల కారణంగా పట్టణాభివృద్ధికి మేలు జరుగుతుందని మున్సిపల్ అధికారులు సంతోషం వెలిబుచ్చుతున్నారు.

పన్ను రాయితీతో రూ.6.85 కోట్ల వసూళ్లు

పట్టణంలో మొత్తం 14,831 ఇళ్లు, భవనాలు(అసెస్‌మెంట్లు) ఉన్నాయి. వీటి ద్వారా ఆస్తి పన్ను రూపేణా మొత్తం రూ.8.11 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యం. అయితే ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించాక గత నెల రోజుల్లో 70 శాతం భవన యాజమానులు స్వచ్ఛందంగా స్పందించి తమ పన్నులను చెల్లించి రాయితీ పొందారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సర ముగింపు రోజైన ఆదివారం రాత్రికి రూ.8.11 కోట్ల లక్ష్యానికి గాను రూ.6.85 కోట్ల మేర వసూళ్లు వచ్చాయి. గత నెల రోజులుగా ఆదివారాలు సెలవైనా పన్ను చెల్లింపుదారుల కోసం మున్సిపల్ కార్యాలయం రెవెన్యూ విభాగం తలుపులు తెరిచే ఉంచారు. కమిషనర్, ఆర్వో, సిబ్బంది పన్నుల వసూళ్ల కోసం, పన్ను రాయితీపై అవగాహన కల్పించేందుకు స్వయంగా పన్నుదారుల ఇళ్లకు, సంస్థలకు వెళ్లి అవగాహన కల్పించారు. పన్నుల చెల్లింపునకు ఆఖరి గడువు రోజైన ఆదివారం రాత్రి పది గంటల వరకూ కూడా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసి పన్నులు కట్టించుకునేందుకు అందుబాటులో ఉన్నారు. వడ్డీ మాఫీని, రాయితీని సద్వినియోగం చేసుకోని 15 శాతం పన్ను చెల్లింపుదారులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అసలుతో పాటు వడ్డీ భారం అనివార్యమవుతుందని కమిషనర్ మనోహర్, ఆర్వో శివాజీలు ఆదివారం సాయంత్రం స్పష్టం చేశారు.

సీఎం జగన్ వల్లే ఉద్యోగాలు



ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న కేశవకుమార్ తదితరులు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చొరవతోనే 1998 మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ అన్నారు. ఉప్పలగుప్తం మండలం కూనవరం ఎంపీపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన చెల్లుబోయిన వీఎస్ శ్రీనివాసరావుకు స్థానిక శ్రీనంద్ స్కూలులో ఆదివారం సాయంత్రం జరిగిన వీడ్కోలు సభకు కేశవకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం శ్రీనివాసరావును జిల్లాలోని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సంఘం కోఆర్డినేటర్ అల్లు వజ్రకుమార్, జిల్లా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

గోడిలో మూడు తాటాకిళ్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లవరం: గోడి పంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగి మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రేవు రామకృష్ణ, ఇంజేటి నాగమణి, మధున సత్యనారాయణలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. అమలాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సర్వస్వం కోల్పోయిన బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాలకు తాళ్ల సరస్వతమ్మ, ముత్యాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాళ్ల సాంబమూర్తి, నాతి శ్రీనివాసరావు, తోట నరసింహరావు, కాండ్రేగుల సత్యనారాయణ, వర్ధనపు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కొత్తపూల ఉత్సవాలు



చింతలూరులో నిర్వహించిన కొత్తపూల ఉత్సవంలో ప్రదర్శిస్తున్న గరగ నృత్యాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ముఖ మండపం ఆవరణలో శనివారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలతో అలంకరించిన పెద్దగరగతో ఐదో విడత కొత్తపూల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ అర్చకుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన గరగ నృత్యాలు భక్తులను అలరించింది. చిన్నారుల చేసిన గరగ నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూలగరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్‌బాబు

మామిడికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణ చేపట్టాలని మామిడికుదురులో ఆదివారం జరిగిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. మామిడికుదురు ఎంపీపీ స్కూల్ వద్ద జరిగిన సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు అధ్యక్షత వహించారు. ఎస్టీయూ సంఘం నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ నెల 8వ తేదీన ముస్లిం ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇవ్వాలని నిర్ణయించారు. మండల అభయ్ కన్వీనరుగా ఉండ్రు శ్రీరమణ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కొమ్ముల వీరరాఘవరావు, మట్టా నాగరాజు, బత్తుల రమేష్‌బాబు, వలవల రాజా, వలవల శ్రీబాలాజీ, వడ్డమూడి రాజు, నేల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం



మాచవరంలో నిర్మించిన సీసీ రోడ్డు

అంబాజీపేట: దీర్ఘకాలికంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని మాచవరం దొమ్మేటివారిపాలెం సిద్ధిబుద్ధి వినాయకుడి ఆలయం నుంచి శివాలయానికి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గతంలోనే ఈ రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజలు నాటి ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదు. రాళ్లు లేచిపోయి నడిచేందుకు వీలులేక, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడి ప్రమాదాల బారిన పడేవారు. వర్షాకాలంలో నానా అవస్థలు పడ్డామని స్థానికులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమ కష్టాలను గుర్తించి ఈ రహదారిని రూ.16 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటీఎంల వద్ద ఓటు అవగాహన పోస్టర్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిటర్నింగ్ అధికారి కులోత్తుంగన్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదయ్యేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా 450 ఏటీఎంల వద్ద పోస్టర్లను అతికించనున్నట్లు రిటర్నింగ్ అధికారి ఎ.కులోత్తుంగన్ తెలిపారు. ఆదివారం ఆయన ఓటు వినియోగంపై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల సహకారంతో ఆయా ఏటీఎంల వద్ద అవగాహన పోస్టర్లను పెడుతున్నామన్నారు. బ్యాంకుల్లో చిన్నపాటి డిజిటల్ స్క్రీన్‌లపైనా పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్ఓ వినయ్‌రాజ్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్జీ పరామర్శ



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎల్జీ రాధాకృష్ణన్

యానాం: పుదుచ్చేరిలోని తంగైతట్టు వద్ద డ్రైనేజీ పనుల్లో గోడ కూలి మృతిచెందిన కార్మికుల కుటుంబసభ్యులను, పుదుచ్చేరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎల్జీ సీపీ రాధాకృష్ణన్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు అందుతున్న వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో ఐదుగురిని కోల్పోవడం చాలా బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం హెల్త్ డైరెక్టర్ శ్రీరాములతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఘటనపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కేంద్ర బలగాల కవాతు



అమలాపురంలో కేంద్ర బలగాల కవాతులో పట్టణ సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: ఎన్నికల నేపథ్యంలో అమలాపురానికి వచ్చిన కేంద్ర బలగాలతో పట్టణ సీఐ క్రిస్టోఫర్ పట్టణ రోడ్లపై ఆదివారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు ధైర్యంగా, స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని సీఐ కె.క్రిస్టోఫర్ సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేందకు మేమున్నామన్న భరోసా కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని కొంకాపల్లి, ఏవీఆర్ నగర్, ముత్యాలమ్మ టెంపుల్ స్ట్రీట్, ఎస్‌కేబీఆర్ కాలేజీ తదితర రోడ్లపై ఫ్లాగ్ మార్చ్ సాగింది.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మునిస్వామి ఆధ్వర్యంలో ఎస్ఓ, ఏఎస్ఓలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు, ఈవీఎంలు, ఈవీ ప్యాట్‌లు తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల గురించి చర్చించారు. సమావేశంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం జగనన్న సంకల్పం



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- కూనవరం, కిత్తనచెరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



కూనవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ఇంటింటికీ సంక్షేమం అందించడమే సంకల్పంగా జగనన్న పరిపాలన సాగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని కూనవరం, కిత్తనచెరువు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టగా, అభిమానులు పూలమాలలతో స్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామానికి జరిగిన అభివృద్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వ్యత్యాసం ప్రజలు గ్రహించుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా ప్రతి ఇంటికి ఏదో రూపంలో సంక్షేమం అందుతూనే ఉందన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఊటాల రామాంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వంటెద్దు వెంకన్నాయుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఆకుల చిన్ని, చిల్లా లక్ష్మణరావు, దేవరపల్లి నాని, కాట్రు కృష్ణ, రాయుడు కేశవరావు, పరమట రాజు, నేలపాటి రమేష్, ఎం.సత్యనారాయణ, జడ్డు పెద్దిరాజు, చిట్టిమేను వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ కాంగ్రెస్ హయాంలోనే పథకాలు



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రంగసామి, నమశ్శివాయం తదితరులు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజా సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని సీఎం రంగసామి పేర్కొన్నారు. ఆదివారం ఎన్డీయే కూటమి అభ్యర్థి నమశ్శివాయం ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ హయాంలో కనీస మౌలిక సౌకర్యాలు సైతం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి ప్రభుత్వం 305 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేసిందని, రూ.226 కోట్ల పీడబ్ల్యూడీ నిధులతో అనేక పనులు చేపట్టిందన్నారు. తాగునీరు, సాగునీటి కోసం రూ.179 కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాధుల వద్ద ప్రార్థనలు



అమలాపురం శ్మశాన వాటికలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అమలాపురం టౌన్: ఏసు క్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు తిరిగి లేవడాన్ని పురస్కరించుకుని ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈస్టర్ సందర్భంగా అమలాపురం పట్టణంలో ఈడబ్ల్యూఎస్ కాలనీకి సమీపంలో ఉన్న శ్మశానం వద్ద క్రైస్తవులు మృతులైన వారి బంధువుల సమాధులను దర్శించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ పరిధిలోని సాకావారిపేటలో వేంచేసిన వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం వీరభద్రస్వామి సంబరం వైభవంగా జరిగింది. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, పల్లకి ఊరేగింపు నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఉదయం స్వామిని మేలు కొలిపి అనంతరం వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద పిల్లి నాగరాజు, మంగ దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. భక్తులు వీరభద్రస్వామి నిప్పుల గుండం తొక్కారు. సాకా ఏడుకొండలు, ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సంబరం ఆద్యంతం కనులపండువలా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు.

పేదలపై ఎందుకంత కక్ష ?



తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దనే పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై టీడీపీ నేతలకు అంత కక్ష ఎందుకని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు వ్యాఖ్యానించారు. మండలంలోని చెముడులంకలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుచరుడు మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ ప్రసాద్‌తో కోర్టులో కేసు వేయించి గ్రామ వలంటీర్ వ్యవస్థను ఎన్నికల కోడ్ పేరిట తాత్కాలికంగా నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. టీడీపీ నేతల చేస్తున్న కుటిల రాజకీయాలు పెత్తందార్లు పోకడలను తలపిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీల చుట్టూ తిరిగే పరిస్థితిని కల్పించిన టీడీపీని ప్రజలే రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తారన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని, మళ్లీ వలంటీర్ వ్యవస్థ పునరుద్ధరించడం ఖాయమని ఆయన ఉద్ఘాటించారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



తూర్పుపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతల ముఖ్యమంత్రి అని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుపాలెం గ్రామం నుంచి టీడీపీకి చెందిన అనేక మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ గొల్లపల్లి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బూటకపు హామీలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనే ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీరావు, తాడి కేశవ, నల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.